సాక్షి కామారెడ్డి

సోమవారం । 15 । సెప్టెంబర్ । 2025



బస్తా యూరియా కోసం..

అన్నదాతల యూరియా కష్టాలు తీరడం లేదు. బస్తా ఎరువు కోసం రోజంతా పడిగాపులు కాయాల్సి వస్తోంది.

- 8లో ▸



పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

జిల్లాలో కురుస్తున్న వర్షాలతో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. దీంతో వ్యాధులు ప్రబలుతున్నాయి.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.0 /22.2

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

చిరుత కోసం గాలింపు



మద్నూర్ : మండల కేంద్ర శివారులో చిరుత కనిపించడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీంతో ఆదివారం అటవీ అధికారులు చిరుత జాడ కోసం గాలింపు చేపట్టారు. మండలంలోని హండేకేలూర్ శివారులో, పక్కనే ఉన్న మహారాష్ట్రలోని నాగ్‌రాల్ శివారులో చిరుత ఉందన్న సమాచారంతో తెలంగాణతోపాటు మహారాష్ట్రకు చెందిన అటవీ అధికారుల బృందాలు గాలింపు చర్యలలో పాల్గొంటున్నాయి. చిరుత తిరిగిన చోట పాదముద్రలను సేకరించామని జుక్కల్ రేంజ్ ఫారెస్ట్ అధికారి సుజాత తెలిపారు. వాటిని గమనిస్తే చిరుత అడుగులుగానే కనిపిస్తున్నాయని, వాటిని ల్యాబ్‌కు పంపిస్తామని పేర్కొన్నారు. చిరుత సంచారం నేపథ్యంలో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. త్వరగా దానిని పట్టుకోవాలని కోరుతున్నారు.

'తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా బతుకమ్మ సంబురాలు'



కామారెడ్డి అర్బన్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా పూలపండుగ బతుకమ్మ ఉత్సవాలు జరుపుకోవాలని సంస్కార భారతి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేకేవీ శర్మ కోరారు. ఆదివారం సంస్కారభారతి కామారెడ్డి శాఖ కార్యాలయంలో బతుకమ్మ సంబరాల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంస్కార భారతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సమ్మిరెడ్డి, సంయుక్త కార్యదర్శి డాక్టర్ ఎన్.రాజు, మాతృశక్తి కన్వీనర్ ఎన్.ప్రసన్న, ఉపాధ్యక్షులు మనోహర్, చిన్న సిద్ధిరాములు, ప్రతినిధులు రామచంద్రరావు, స్వామిగౌడ్, సాయిబాబాగౌడ్, రమేష్‌గౌడ్, పరమేశ్వర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపన్యాస పోటీలు



బాన్సువాడ : బాన్సువాడలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఆదివారం హిందీ దివస్‌ను పురస్కరించుకుని విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. మేరా యువ భారత్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సునీల్ రాథోడ్ మాట్లాడుతూ హిందీ భాష నేర్చుకుంటే ఎన్నో ఉపయోగాలు ఉంటాయన్నారు. ఏ రాష్ట్రానికి వెళ్లినా భాషా సమస్య ఉండదన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం విజయ భారతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోచారం ప్రధాన కాలువ మరమ్మతుల పరిశీలన



నాగిరెడ్డిపేట: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నాగిరెడ్డిపేట శివారులో దెబ్బతిన్న పోచారం ప్రధాన కాలువకు చేపట్టిన మరమ్మతులను ఆదివారం ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ప్రధాన కాలువకు చేపడుతున్న మరమ్మతులకు సంబంధించి సంబంధిత కాంట్రాక్టర్‌కు పలు సూచనలు ఇచ్చారు. మరమ్మతులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట ఇరిగేషన వర్క్‌ఇన్‌స్పెక్టర్ యాదగిరి ఉన్నారు.

'యాత్రాదానం' ప్రారంభం

ఖలీల్‌వాడి: పర్యాటక రంగ అభివృద్ధి, ప్రయాణికులకు విభిన్నమైన సేవలు అందించేందుకు 'యాత్రాదానం- గిఫ్ట్ ఏ బస్ ట్రావెల్' పథకాన్ని ప్రారంభించినట్లు ఆర్టీసీ ఆర్‌ఎం జ్యోత్స్న తెలిపారు. ఈ పథకం కింద కార్పొరేట్, స్వచ్ఛంద సంస్థలు, సంఘాలు, విద్యాసంస్థలు, సమాజ సేవా సంస్థలు, ఉమ్మడి కుటుంబాలు స్పాన్సర్‌షిప్ ద్వారా బస్సు యాత్రలను అందించవచ్చన్నారు. ఆసక్తిగలవారు 99592 26018(కామారెడ్డి), 99592 26020(బాన్సువాడ), నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



ఎన్ ఆకారంలో నిర్మించిన నిజాంసాగర్ ప్రాజెక్టు



నిజాంసాగర్ ప్రాజెక్టు వద్ద ప్రాజెక్టు రూపకర్త నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ విగ్రహం

- భారీ వరదలను తట్టుకునేలా నిజాం కాలంలో నిర్మాణాలు
- మొన్నటి విపత్తులోనూ నిలబడిన పోచారం
- ఎంతటి వరదొచ్చినా తట్టుకునే శక్తి ఉన్న నిజాంసాగర్
- నవాబ్‌అలీ నవాజ్ జంగ్ బహదూర్ ఇంజినీరింగ్ నైపుణ్యానికి నిదర్శనంగా నిలుస్తున్న ప్రాజెక్టులు

నేడు ఇంజినీర్స్ డే



పోచారం ప్రాజెక్టు

వందేళ్ల జ్ఞాపకం..

చెక్కుచెదరని కట్టడం

జిల్లాలో సుమారు వందేళ్ల క్రితం నిర్మించిన పోచారం, నిజాంసాగర్ జలాశయాలు ఇప్పటికీ చెక్కుచెదరలేదు. ఇవి అనేక విపత్తులను తట్టుకుని నిలబడ్డాయి. చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో ఇటీవల వచ్చిన భారీ వరదలను సైతం తట్టుకుని ఆనాటి ఇంజినీరింగ్ నైపుణ్యాలకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : నిజాం కాలంలో ఎన్నో ప్రాజెక్టులకు రూపకల్పన చేసిన ఇంజినీర్ నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ తెలంగాణ సాగు నీటి రంగ పితామహుడిగా కీర్తికెక్కారు. ఆయన పర్యవేక్షణలో కామారెడ్డి జిల్లాలో మంజీర నదిపై నిర్మించిన నిజాంసాగర్ ప్రాజెక్టు, పోచారం ప్రాజెక్టులు వందేళ్లు గడచినా చెక్కుచెదరలేదు. ఎన్నడూ లేనంతగా ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ప్రాజెక్టు మట్టి కట్టను కోసుకుంటూ వెళ్లిన వరద తాకిడిని సైతం తట్టుకుని నిలబడింది పోచారం ప్రాజెక్టు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ చేసిన కృషికి గుర్తుగా నిజాంసాగర్ ప్రాజెక్టు వద్ద ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం ఇంజినీర్స్ డే సందర్భంగా జిల్లాలోని పలు ప్రాజెక్టులపై కథనం..

అద్భుతమైన నిర్మాణం నిజాంసాగర్..

గోదావరికి ఉపనది అయిన మంజీర నదిపై అచ్చంపేట గ్రామం వద్ద నిజాంసాగర్ ప్రాజెక్టు నిర్మించారు. నిజాం పాలనలో ఇంజినీర్ నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ నేతృత్వంలో 1923 సంవత్సరంలో ప్రాజెక్టు నిర్మాణ పనులు మొదలుపెట్టి 1931లో పూర్తి చేశారు. రూ. 3.15 కోట్ల వ్యయంతో ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేశారు. రెండున్నర లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీటితోపాటు బోధన్, నిజామాబాద్ పట్టణాల ప్రజలకు తాగు నీటిని అందించేందుకు ప్రాజెక్టు నిర్మించారు. అప్పట్లో ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 1,400 అడుగులు(29.5 టీఎంసీలు). ఏటా వర్షాకాలంలో పూడికతో ప్రాజెక్టు సామర్థ్యం పడిపోతూ వచ్చింది. 1975 సంవత్సరంలో ప్రాజెక్టు నీటినిలువ సామర్థ్యంపై ఇంజినీరింగ్ అధికారులు రీసెర్చ్ చేశారు. ప్రాజెక్టు నిల్వ సామర్థ్యం 11.89 టీఎంసీలకు పడిపోవడంతో ఎఫ్‌ఆర్‌ఎల్ లెవన్‌ను 4.5 అడుగులకు పెంచారు. దీంతో 1978 సంవత్సరం నుంచి ప్రాజెక్టు నీటి మట్టం 1,405 అడుగుల (17.8 టీఎంసీ)కు చేరింది. అంతేకాకుండా ప్రాజెక్టులో పూడికను అరికట్టడానికి సంగారెడ్డి జిల్లాలో సింగూరు జలాశయాన్ని నిర్మించారు. అయినా నిజాంసాగర్ ప్రాజెక్టు గర్భం నిండా పూడికమట్టి నిండి ఉంది. ఇటీవల నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రాజెక్టును సందర్శించిన సందర్భంలో పూడిక తీస్తామని హామీ ఇచ్చారు. నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువ ఆధునికీకరణ పనుల కోసం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి రూ. 459.5 కోట్లు మంజూరు చేశారు. తద్వారా ప్రధాన కాలువకు సిమెంట్ లైనింగ్ పనులు జరిగాయి.

వరదపోటును తట్టుకున్న పోచారం...

కామారెడ్డి, మెదక్ జిల్లాల సరిహద్దుల్లో నాగిరెడ్డిపేట మండలం పోచారం గ్రామ శివారులో నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ 1917లో పోచారం ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దీని నిర్మాణం 1922 సంవత్సరంలో పూర్తయ్యింది. అప్పట్లో రూ. 27.11 లక్షల వ్యయంతో ప్రాజెక్టు నిర్మించారు. నిజాం ప్రభుత్వంలో ఇంజినీర్ నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ ఆధ్వర్యంలో ప్రాజెక్టు నిర్మాణం జరిగింది. 21 అడుగుల ఎత్తు, 1.7 కిలోమీటర్ల పొడవుతో ప్రాజెక్టు ఆనకట్టను నిర్మించారు. ప్రాజెక్టు నిర్మాణంలో రాళ్లు, డంగు సున్నం మాత్రమే వినియోగించారు. మొదట 3.4 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యంతో ప్రాజెక్టును నిర్మించాలని తలచినప్పటికీ ప్రతికూల పరిస్థితుల కారణంగా 2.423 టీఎంసీలకు పరిమితం చేశారు. కాలక్రమంలో పూడిక పెరగడంతో ప్రస్తుతం ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం1.52 టీఎంసీలకు తగ్గిపోయింది. ప్రాజెక్టు దిగువన ఉన్న భూములకు సాగునీటిని అందించేలా 58 కిలోమీటర్ల పొడవుతో కాలువను నిర్మించారు. 73 డిస్ట్రిబ్యూటరీల ద్వారా 10,500 ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తున్నారు. 70 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహాన్ని తట్టుకునే శక్తి ఉన్న పోచారం ప్రాజెక్టులోకి గత నెల 27, 28 తేదీలలో జిల్లాలో దంచికొట్టిన వర్షాలతో ఎవరూ ఊహించని రీతిలో 1.82 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. అయినా ప్రాజెక్టు స్ట్రక్చర్ బలంగా ఉండడంతో దెబ్బతినలేదు. పక్కన మట్టి కొట్టుకుపోయినా ప్రాజెక్టు నిలబడిందంటే అప్పటి నిర్మాణ శైలే కారణమంటున్నారు.

విగ్రహం ఏర్పాటు చేసి గౌరవించిన ప్రభుత్వం

నిజాంసాగర్‌తో పాటు పోచారం ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది నిజాం ప్రభుత్వ ఇంజినీర్ నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్. ప్రభుత్వం 2014లో నిజాంసాగర్ ప్రాజెక్టు వద్ద ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసి గౌరవించింది.

బీర్కూర్ 'సహకారం' ఎవరికో?

- పోచారం, ఏనుగు వర్గీయుల మధ్య పోటీ
- నేడో రేపో స్పష్టత వచ్చే అవకాశం



బీర్కూర్ ప్రాథమిక సహకార సంఘ భవనం

బాన్సువాడ : బీర్కూర్ సహకార సంఘం అధ్యక్ష పదవి కోసం వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి వర్గాల మధ్య పోటీ నెలకొంది. అధ్యక్ష పదవి కోసం ఇరు వర్గాల డైరెక్టర్లు పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. గతంలో సహకార సంఘం అధ్యక్షుడిగా ఉన్న గాంధీ ఆరోగ్యం సహకరించడం లేదని ఆరు నెలల క్రితం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. దీంతో ఉపాధ్యక్షుడిగా ఉన్న కిష్టాపూర్ గ్రామానికి చెందిన రాధాకృష్ణకు అధికారులు ఇన్‌చార్జి అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించారు. కాగా ఆయన సహకార సంఘంలో బకాయి పెట్టి ఎరువులను తీసుకున్నారు. ఎరువుల బకాయిలు రూ.1.20 లక్షలు చెల్లించాలని జిల్లా సహకార అధికారులు రాధాకృష్ణకు నోటీసులు ఇచ్చారు. అయితే రాధాకృష్ణ ఎంతకీ బకాయి మొత్తాన్ని చెల్లించకపోవడంతో ఇన్‌చార్జి పదవి నుంచి తొలగిస్తున్నట్లు ఇటీవల అధికారులు మరోసారి నోటీసులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం అధ్యక్ష పదవికి మరో డైరెక్టర్‌ను నియమించాల్సి ఉంది. పోచారం వర్గానికి చెందిన డైరెక్టర్ ఇంగు రాములు, ఏనుగు రవీందర్‌రెడ్డి వర్గానికి చెందిన పోగు పాండు అధ్యక్ష పదవి కోసం పట్టుపడుతున్నారు. ఇరువురు కూడా స్థానిక నాయకులతో కలిసి రెండు రోజులుగా హైదరాబాద్‌లోనే మకాం వేశారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి వర్గానికి చెందిన ఇంగు రాములు తన నాయకులతో కలిసి సీఎంతో పాటు మంత్రులను కలిసినట్లు తెలిసింది. ఏనుగు రవీందర్‌రెడ్డి వర్గానికి చెందిన పోగు పాండు.. ఎంపీ సురేశ్ షెట్కార్‌తో కలిసి పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసి అధ్యక్ష పదవి ఇవ్వాలని కోరినట్లు సమాచారం. ప్రస్తుతం డివిజన్‌లో అందరి దృష్టి బీర్కూర్ సహకార సంఘంపై ఉంది. నేడో రేపో అధ్యక్ష పదవి ఎవరికి ఇస్తారన్న దానిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

సంస్కారాన్ని నేర్పుతున్న శిశుమందిరాలు

- ఎమ్మెల్యేలు వెంకటరమణారెడ్డి, మదన్‌మోహన్‌రావు
- ముగిసిన రాష్ట్రస్థాయి గణిత విజ్ఞాన మేళా



గణిత విజ్ఞాన ప్రదర్శనను తిలకిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు



విజ్ఞానమేళా విజేతలతో ఎమ్మెల్యేలు, అతిథులు

కామారెడ్డి అర్బన్: నైతిక విలువలు కనిపించకుండా పోతున్న ప్రస్తుత సమాజంలో చదువుతో పాటు సంస్కారం నేర్పుతున్న శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలల్లో చదువుకోవడాన్ని విద్యార్థులు అదృష్టంగా భావించాలని కామారెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యేలు వెంకటరమణారెడ్డి, మదన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. శ్రీసరస్వతి విద్యాపీఠం ఆధ్వర్యంలో కామారెడ్డిలోని శ్రీసరస్వతి విద్యామందిర్ హైస్కూల్‌లో శుక్రవారం ప్రారంభమైన రాష్ట్రస్థాయి గణిత సాంస్కృతిక విజ్ఞాన మేళా ఆదివారం ముగిసింది. ముగింపు సమావేశంలో ఎమ్మెల్యేలు పాల్గొని మాట్లాడారు. పోటీ ప్రపంచంలో ఆధునిక సాంకేతికత నుంచి మంచిని మాత్రమే తీసుకోవాలని, భారతీయులందరు తన కుటుంబ సభ్యులేననే జాతీయ భావన ప్రతి ఒక్కరిలో రావాలని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. విద్య, నిజాయితీ, వ్యక్తిత్వం, సవాళ్లను ఎదుర్కొనే శక్తి ఉంటే ఏదైనా సాధించవచ్చని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. మానవ జీవితంతో గణితం, సైన్స్ విడదీయరాని సంబంధం కలిగి ఉన్నాయని ముఖ్య వక్త అర్ధచంద్ర ప్రకాశ్‌రెడ్డి పేర్కొన్నారు. అనంతరం విజ్ఞాన మేళా విజేతలకు బహుమతులు అందించారు. నిర్వాహకులు ఎమ్మెల్యేలు వెంకటరమణారెడ్డి, మదన్‌మోహన్‌రావులను సన్మానించారు. రెండు ప్రధాన పార్టీలకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలను ఒకే వేదికపై సన్మానించడంతో సభాప్రాంగణం చప్పట్లతో మారుమోగింది. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సంఘచాలక్ బొడ్డు శంకర్, శ్రీసరస్వతి విద్యాపీఠం జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్‌రావు, వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షులు సామల గంగారెడ్డి, రాష్ట్ర ప్రతినిధులు కృష్ణమాచార్యులు, హరిస్మరణ్ రెడ్డి, గీరెడ్డి రాజారెడ్డి, రంజిత్‌మోహన్, మల్లేష్‌యాదవ్, ప్రధానాచార్యులు నాగభూషణం, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులకు నిధులు మంజూరు

- 8 పనులకు రూ. 46 లక్షలు..
- యుద్ధ ప్రాతిపదికన పనుల ప్రారంభానికి చర్యలు

నిజాంసాగర్ : జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో దెబ్బతిన్న ప్రాజెక్టులు, చెరువులకు తాత్కాలిక మరమ్మతులకోసం నిధులు మంజూరయ్యాయి. పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టనున్నారు.

కల్యాణి ప్రాజెక్టుకు వరద పోటెత్తడంతో గత నెల 27న మట్టి కట్టలు తెగిపోయిన విషయం తెలిసిందే. ఎగువ నుంచి వరద నీరు ఉధృతంగా రావడంతో ప్రాజెక్టు మట్టికట్టలు తెగడంతో బొగ్గుగుడిసె చౌరస్తా నీటమునిగింది. మట్టి కట్టలకు తాత్కాలిక మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ. 20 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో కల్యాణి ప్రాజెక్టుకు రెండువైపులా కొట్టుకుపోయిన మట్టి కట్టల వద్ద ఇసుక బస్తాలు, మట్టి, మొరం వేసి తాత్కాలికంగా గండ్లు పూడ్చనున్నారు.

చెరువు కట్టలకు..

మహమ్మద్‌నగర్ మండలంలోని నర్వ పాతచెరువు పంట కాలువ కొట్టుకుపోయింది. దీనికి మరమ్మతుల కోసం రూ. 5.9 లక్షలు మంజూరయ్యాయి. సింగితం రిజర్వాయర్ రిటెయినింగ్ వాల్ తాత్కాలిక మరమ్మతులకు రూ. 9.5 లక్షలు మంజూరు చేశారు. గాలిపూర్ చెరువు మరమ్మతులకు రూ. 2 లక్షలు, మద్నూర్ మండలం హండేకల్లూర్ చెరువుకు లక్ష రూపాయల చొప్పున ఫ్లడ్ డ్యామేజ్ కింద నిధులు మంజూరయ్యాయి.

చిన్నపూల్ వంతెన రెయిలింగ్‌కు..

ఇటీవల నిజాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్ల ద్వారా 2.5 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో నిజాంసాగర్‌లోని చిన్నపూల్ వంతెన రెయిలింగ్ కొట్టుకుపోయింది. దీనికి మరమ్మతుల కోసం రూ. 6.75 లక్షలు మంజూరయ్యాయి.

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం

వర్షాలు, వరదల కారణంగా దెబ్బతిన్న మట్టి కట్టలకు తాత్కాలిక మరమ్మతుల కోసం ఎమర్జెన్సీ కింద రూ. 46 లక్షలు మంజూరయ్యాయి. కల్యాణి ప్రాజెక్టు మట్టికట్టలతో పాటు సింగితం రిజర్వాయర్ రిటెయినింగ్ వాల్, పలు చెరువులకు మరమ్మతుల కోసం నిధులు వచ్చాయి. ఒకటిరెండు రోజుల్లో టెండర్లు పూర్తి చేసి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడతాం.

– సోలోమన్, నీటిపారుదల శాఖ ఈఈ, నిజాంసాగర్



కోతకు గురైన కల్యాణి ప్రాజెక్టు కట్ట



కొట్టుకుపోయిన నర్వ పాతచెరువు పంట కాలువ

పోచారం వద్ద పర్యాటకుల సందడి

పోచారం ప్రాజెక్టు వద్ద పర్యాటకుల సందడి నెలకొంది. ఆదివారం సెలవుదినం కావడంతో వందల సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. ప్రాజెక్టు అందాలను తిలకించారు. ప్రాజెక్టు అలుగుపైనుంచి దిగువకు జాలువారుతున్న వరదనీటిలో జలకాలాడుతూ కుటుంబసభ్యులు, మిత్రులతో కలిసి ఉత్సాహంగా గడిపారు. – నాగిరెడ్డిపేట



ప్రాజెక్టు దిగువన సందర్శకుల సందడి

క్లుప్తంగా

వానర మూక స్వైర విహారం



రామారెడ్డి: వానరమూక రోడ్డుపై తిష్ట వేసి రోడ్డుపై వెళ్లే వారిని భయాందోళనకు గురిచేస్తున్నాయి. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం మద్దికుంట మర్రి నుంచి రెడ్డిపేట ఎల్లమ్మ గుడి వరకు కిలోమీటర్ దూరం వరకు వానరమూక గుంపులు గుంపులుగా ఆదివారం హల్‌చల్ చేశాయి. ఆ వానరమూకను అక్కడి నుంచి తరలించడం ఎవరికీ సాధ్యం కాకపోవడంతో చుట్టుపక్కల రైతులు తలలు పట్టుకుంటున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై వానర మూకలను అక్కడి నుంచి తరలించాలని కోరుతున్నారు.

పెద్ద చెరువు కట్ట తాత్కాలిక నిర్మాణ పనులు ప్రారంభం



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మాపూర్ పెద్ద చెరువు కట్ట తాత్కాలిక పనులను ఆదివారం నీటిపారుదల శాఖ అధికారులు ప్రారంభించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కట్ట తెగిపోవడంతో కట్ట నిర్మాణ పనులను తాత్కాలికంగా జరుపుతున్నట్లు డీఈ వెంకటేశ్వర్లు తెలిపారు. పంటలు ఎండకుండా వచ్చిన నీరు బయటకు వెళ్లకుండా ఉండేందుకు పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

బతుకమ్మ సంబురాలు



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని బీసీ బాలికల వసతి గృహంలో ఆదివారం బతుకమ్మ సంబరాలను జరుపుకున్నారు. బతుకమ్మ పండుగలో భాగంగా హాస్టల్‌లో బాలికలు రంగురంగుల పూలతో బతుకమ్మలను తయారు చేసి పండుగను ఆనందంగా జరుపుకున్నారు. వార్డెన్ విజయశాంతి, బాలికలు తదితరులున్నారు.

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

- రోడ్లపై పారుతున్న మురికి నీరు
- జిల్లాలో రెండు నెలల్లో 59 డెంగీ కేసులు
- బిచ్కుందలో ఇద్దరికి డెంగీ నిర్ధారణ
- ప్రబలుతున్న విషజ్వరాలు.. ఆందోళనలో ప్రజలు
- చోద్యం చూస్తున్న మున్సిపల్, వైద్య శాఖాధికారులు



బిచ్కుంద అంబేడ్కర్ చౌరస్తాలో మెయిన్ రోడ్డుపై..



బిచ్కుంద శివసాయి కాలనీలో ఇంటి ముందు నిలిచిన మురికి

బిచ్కుంద(జుక్కల్): పల్లెల నుంచి పట్టణం వరకు విషజ్వరాలు విజృంభించి ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. ప్రతి ఇంటి నుంచి ఒకరిద్దరు జ్వర పీడితులున్నారు. కురిసిన వర్షాల వల్ల బిచ్కుందలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. మున్సిపాల్ అధికారులు పారిశుద్ధ్యంపై అంతగా దృష్టి సారించకపోవడంతో ఆయా వార్డులలో మురికి నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. ఎటుచూసినా ఇళ్ల నివాసాల మధ్య మోకాళ్ల వరకు వరద, మురికి నీరు ఆగి ఉన్నాయి. గ్రామాల్లో పంచాయతీ అధికారులు, పట్టణంలో మున్సిపల్ అధికారులు పూర్తి స్థాయిలో పారిశుద్ధ్య లోపాన్ని నిర్మూలించలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో దోమలకు మురికి ప్రాంతాలు ఆవాసాలుగా మారుతున్నాయి. వ్యాధులు వ్యాప్తి చెంది ప్రజలు డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వివిధ వ్యాధులు, జ్వరాల బారినపడుతున్నారు. రోజురోజుకు ఆస్పత్రుల్లో ఓపీ రోగుల సంఖ్య పెరుగుతోంది.

డెంగీ కేసులతో ఆందోళన..

జిల్లాలో డెంగీ కేసులు పెరుగుతున్నాయి. జులై, ఆగస్టు నెలల్లో 59 డెంగీ కేసులు నమోదయ్యాయి. బిచ్కుందలో 2 డెంగీ కేసులు నిర్ధారణ అయ్యాయి. హజ్గుల్‌లో 12 ఏళ్ల బాలునికి, బిచ్కుందలో ఓ మహిళకు డెంగీ బారినపడి బిచ్కుంద, బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రిలో వారం రోజుల క్రితం చికిత్స పొందారు. ఇంటి పరిసరాలలో ఆగిన మురికి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. డెంగీ కేసులు పెరగడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతున్నా వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపల్ అధికారులు చోద్యంచూస్తున్నారు.

నిధుల కొరతతో పనుల్లో జాప్యం..

బిచ్కుంద మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు ఇవ్వడం లేదు. ఇప్పటికే సొంత డబ్బులు పెట్టుకొని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు, తాగునీటి మోటార్లు, వీధి లైట్లు, కార్మికులు వేతనాలకు ఇచ్చి పనులు చేస్తున్నట్లు జీపీ అధికారులు అంటున్నారు. జీపీ నిర్వహణకు ప్రభుత్వం చిల్లి గవ్వ నిధులు ఇవ్వలేదు.. పనులు చేయలేమని అధికారులు చేతులు ఎత్తేస్తున్నారు. బిచ్కుంద కొత్తగా మున్సిపాలిటీగా ఏర్పడి నాలుగైదు నెలల కావస్తుంది..కానీ ఇప్పటి వరకు నిధులు రాలేదు. ఆదాయం తక్కువ ఖర్చు ఎక్కువ ఉందని పనులు చేపట్టడానికి వార్డు ఆఫీసర్లు వెనకడుగు వేస్తున్నారు. ఇకనైనా కలెక్టర్ స్పందించి జీపీలు, మున్సిపాలిటీకి నిధులు వచ్చే విధంగా చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అవగాహన పెంచడంలో విఫలం..

ఇళ్లల్లోని తొట్టెలలో నిలువ నీటి పారబోత, ఇంటి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన వైద్య, మున్సిపల్, పంచాయతీ శాఖల అధికారులు బిచ్కుంద మండలంలో విఫలమయ్యారు. బిచ్కుంద మున్సిపాలిటీలో 100 రోజుల ప్రణాళిక తయారు చేసి అమలు చేస్తున్నట్లు ఎక్కడా ఆనవాళ్లు కనపడటం లేదు. ప్రతి శుక్రవారం ఫ్రైడే – డ్రైడే కార్యక్రమం చేపట్టి.. జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించాల్సిన వైద్య సిబ్బంది, జీపీ అధికారులు పత్తాలేకుండా పోయారు. విషజ్వరాల గుర్తింపు.. తూతుమంత్రంగా సర్వే చేసి చేతులు దులుపుకుంటున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కళాశాలకు ప్రొజెక్టర్ అందజేత



విద్యార్థులకు ప్రొజెక్టర్‌ను అందజేస్తున్న సీఐలు

బాన్సువాడ: బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ముగ్గురు సీఐలు కలిసి ప్రొజెక్టర్‌ను అందజేశారు. బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ల సంఖ్య పెరిగిన నేపథ్యంలో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించాలనే లక్ష్యంతో బాన్సువాడ పట్టణానికి చెందిన చతుర్వేది అభినవ (సర్కిల్ ఇన్‌స్పెక్టర్, హైదరాబాద్), సంజీవ్ (సర్కిల్ ఇన్‌స్పెక్టర్, హైదరాబాద్), సాజిద్(జోనల్ ఇన్‌స్పెక్టర్, నిజామాబాద్)లు కలిసి రూ.30 వేలు విలువ గల ప్రొజెక్టర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివితే రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించగలరని అన్నారు. భవిష్యత్‌లో ఉన్నత స్థానాలను సాధించాలని ఆకాంక్షించారు. ఇంటర్మీడియట్ అధికారి షేక్ సలాం, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ శివకుమార్, అధ్యాపకులు ఉన్నారు.

బుచ్చన్న సేవలు మరువలేని

భిక్కనూరు: జంగంపల్లి గ్రామాభివృద్ధికి విండో మాజీ చైర్మన్ గువ్వ బుచ్చన్న అందించిన సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ జంగంపల్లి గ్రామానికి వచ్చి ఇటీవల మృతి చెందిన బుచ్చన్న ఇంటికి వెళ్లి వారి కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బుచ్చన్న కామారెడ్డి ప్రాంతంలో మొదటగా జంగంపల్లిలో ఆర్య సమాజ్ మందిరం నిర్మించడంతో కీలక పాత్ర వహించాడన్నారు. బీఆర్ఎస్ నేతలు శ్రీనివాస్, తున్కి వేణు, సలీం తదితరులు ఉన్నారు.

ఆత్మీయ పలకరింపులు.. మధుర స్మృతులు



భిక్కనూరు జెడ్పీ బాలుర, బాలికల పాఠశాలల 1988-89 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు



భిక్కనూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల 1989-90 బ్యాచ్ విద్యార్థులు

- జిల్లాలో పలుచోట్ల సమ్మేళనాలు నిర్వహించిన పూర్వవిద్యార్థులు
- ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో భావోద్వేగానికి గురైన చిన్ననాటి మిత్రులు



ఉత్తునూర్ జెడ్పీహెచ్ఎస్ 2001-02 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు

భిక్కనూరు/సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఆత్మీయ పలకరింపులు.. ఆపాత మధుర స్మృతులను గుర్తుకు తెచ్చుకుని పూర్వ విద్యార్థులు భావోద్వేగానికి లోనయ్యారు. అరే ఎన్నాళ్లయింది కలుసుకుని.. పూర్తిగా మారిపోయావంటూ ఆనాటి స్నేహితులు ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో హర్షం వ్యక్తంచేశారు. భిక్కనూరులోని పద్మశాలి కల్యాణ మండపంలో ఆదివారం భిక్కనూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. భిక్కనూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల 1989-90 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు పెద్దమల్లారెడ్డిలోని వీరభద్ర ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అలాగే సదాశివనగర్ మండలంలోని ఉత్తునూర్ ఉన్నత పాఠశాల 2001–02 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు సైతం సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా చిన్ననాటి మిత్రులందరూ ఏళ్ల తర్వాత మళ్లీ ఒకే వేదికపై కలుసుకోవడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఒకరినొకరు పలకరించుకుంటూ అనాటి జ్ఞాపకాలను గుర్తుకుతెచ్చుకున్నారు. నాడు చదువు నేర్పిన ఉపాధ్యాయులను సమ్మేళనానికి ఆహ్వానించి, సన్మానించారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. అనంతరం విద్యార్థులు, గురువులు అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.

ఒక్క బస్తా యూరియా కోసం..

- పనులన్నీ వదిలేసుకొని రాత్రి పగలు పడిగాపులు
- అన్నారం, రెడ్డిపేట గ్రామాలలో యూరియా కోసం బారులు తీరిన రైతులు



అన్నారంలో యూరియా కోసం క్యూలో నిల్చున్న రైతులు

రామారెడ్డి: రైతులకు ఒక యూరియా బస్తా దొరకడమే గగనమైపోయింది. ఒకరోజు ఒక బస్తా యూరియా కోసం టోకెన్ తీసుకోవడం కోసం క్యూ లైన్, ఆ తర్వాత తీసుకున్న టోకెన్ ద్వారా యూరియా బస్తా తీసుకోవడం కోసం మరో క్యూ లైన్‌లో ఉండాల్సి వస్తోంది. ఆదివారం రామారెడ్డి మండలంలోని రెడ్డిపేట, అన్నారం గ్రామాలలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. పోలీసులు యూరియా పంపిణీ కోసం భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. రెడ్డి పేటలో 440 బస్తాలు పంపిణీ చేయగా, అన్నారంలోనూ 440 బస్తాలను రైతులకు పంపిణీ చేశారు.

ఒక బస్తా దొరకలేదు



నాకు 79 ఏళ్లు. మబ్బున మూడు గంటలకు వచ్చి లైన్ కట్టిన. లైన్లో నిలబడి కింద పడితే పక్కన కూర్చోపెట్టారు. ఒక బస్తా నైనా దొరుకుతుందో లేదో తెలవదు. – సాయవ్వ, రైతు, అన్నారం

దేమికలాన్‌లో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): దేమికలాన్ సింగిల్ విండో కార్యాలయంలో ఆదివారం యూరియాను పంపిణీ చేశారు. కార్యాలయానికి యూరియా ఎరువులు వచ్చాయని తెలియగానే రైతులు తరలి వచ్చి కార్యాలయం వద్ద క్యూలో నిలుచొని ఎరువులను తీసుకున్నారు. ఎలాంటి గొడవలు జరుగకుండా ఎస్సై మురళి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



యూరియా కోసం క్యూలో ఉన్న రైతులు

తల్లిని చంపిన కొడుకు అరెస్టు



బాన్సువాడ: తల్లిని సాకలేక మంజీర నదిలో తోసేసిన కొడుకును అరెస్ట్ చేసినట్లు బాన్సువాడ డీఎస్పీ విఠల్‌రెడ్డి తెలిపారు. బాన్సువాడ డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. బోర్లం గ్రామానికి చెందిన సాయవ్వ(75)కు కొడుకు బాలయ్య ఉన్నాడు. వృద్ధురాలైన సాయవ్వ గత కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురయింది. ఆమెకు సేవలు చేయడానికి ఇంట్లో ఎవరూ లేరు. దీంతో కొడుకు బాలయ్య ఆమెను సాకలేక ఈనెల 8న ఓ మైనర్‌తో కలిసి సాయవ్వను బైక్‌పై ఎక్కించుకొని బోలక్‌పల్లి బ్రిడ్జి వద్దకు తీసుకెళ్లి బ్రిడ్జి పైనుంచి నదిలోకి తోసివేశాడు. ఈ 11న సాయవ్వ మృతదేహం నదిలో తేలడంతో ఈనెల 12న బోర్లం గ్రామ పెద్దలు బాలయ్య వద్ద ఉన్న మైనర్‌ను పట్టుకొని ప్రశ్నించారు. అతడు సాయవ్వను కొడుకే నదిలో పడేశాడని తెలిపాడు. విషయం తెలుసుకున్న పోలీసులు కొడుకు కోసం గాలింపు చేపట్టారు. ఈనెల 14న నిందితుడు ఎర్రోళ్ల బాలయ్యతోపాటు మైనర్ కలిసి బోర్లం నుంచి వస్తుండగా కొయ్యగుట్ట చౌరస్తా వద్ద అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. వారి వద్ద ఉన్న బైక్‌ను, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. బాలయ్యను రిమాండ్‌కు తరలించామని, మైనర్‌ను జువైనల్ అబ్జర్వేషన్ హోంకు తరలించామని అన్నారు.

యూరియా కొరత రాకుండా చర్యలు



దోమకొండ: నియోజకవర్గంలో యూరియా కొరత రాకుండా అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ తెలిపినట్లు మాజీ సీడీసీ చైర్మన్ ఐరేని నర్సయ్య తెలిపారు. ఆదివారం షబ్బీర్‌అలీని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలువగా, సాక్షి దినపత్రికలో వచ్చిన కథనాలపై బీబీపేట ఎస్సైతో పాటు పార్టీ నాయకులు, అధికారులతో మాట్లాడినట్లు వివరించారు. అలాగే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నాయకులు గెలిచేలా కృషి చేయాలని సూచించారని అన్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



దోమకొండ: మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు సందెల అబ్బయ్య, సిద్దరాములు, రంజిత్‌గౌడ్, మాజీ సర్పంచ్ నల్లపు అంజలి, మాజీ ఎంపీపీ కానుగంటి శారద, భక్తులు పాల్గొన్నారు.

శబరిమాత ఆశ్రమంలో ప్రత్యేక భజనలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శబరి మాత ఆశ్రమంలో శనివారం రాత్రి భక్తులు భగవన్నామ సంకీర్తనలతో ప్రత్యేక భజనలు చేశారు. అలాగే ఆలయం ప్రాంగణంలోని వెంకటేశ్వర, దత్తాత్రేయ, మార్కండేయ ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. ఈయేడాది పంటలు బాగా పండాలని దేవతామూర్తులను వేడుకున్నారు. రెండో శనివారం కావడంతో భక్తులు భారీగా తరలివచ్చారు.

క్రైం కార్నర్

మురికి కాలువలో వ్యక్తి మృతదేహం లభ్యం



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని శివ సాయి కాలనీలోగల మురికి కాలువలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. సదరు మృతదేహాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే వారు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి ప్యాంట్ జేబులో దొరికిన ఆధార్ కార్డులో నిర్మల్ లక్ష్మణ్ పేరు ఉందన్నారు. వయస్సు 42, చిరునామా బ్రాహ్మణపల్లి, ఎడపల్లి మండలం అని ఉందన్నారు. మృతుడు బ్లాక్ కలర్ షర్ట్, బ్లూ కలర్ జీన్స్ ధరించినాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని సీఐ తెలిపారు.

బ్రిడ్జిపై దిగబడిన లారీ



ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని అడవిలింగాల్ గేట్ వద్ద ఎల్లారెడ్డి–కామారెడ్డి ప్రధాన రహదారిపై ఉన్న బ్రిడ్జిపై ఆదివారం లారీ అదుపుతప్పి బ్రిడ్జిని ఢీకొని బురదలో కూరుకుపోయింది. లారీ ఎల్లారెడ్డి నుంచి కామారెడ్డికి వెళ్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. లారీ బ్రిడ్జి పక్కకు కూరుకుపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగాయి. ఆర్అండ్‌బీ డీఈ నారాయణ, ఏఈ ఐశ్వర్యలు స్పందించి బ్రిడ్జిపై దిగబడిపోయిన లారీని క్రేన్ల సహాయంతో తొలగించి రాకపోకలు కొనసాగేలా చర్యలు తీసుకున్నారు.

నారింజపండ్ల లారీ బోల్తా..



ఇందల్వాయి: మండలంలోని చంద్రాయన్‌పల్లి శివారులో నారింజ పండ్ల లోడ్‌తో వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు బోల్తాపడింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. నారింజ పండ్ల లోడ్‌తో ఉన్న లారీ ఆదివారం హైదరాబాద్ నుంచి నాగ్‌పూర్‌వైపు జాతీయ రహదారిపై వెళ్తోంది. మండలంలోని చంద్రాయన్‌పల్లి శివారులో ప్రమాదవశాత్తు లారీ అదుపుతప్పి బోల్తాపడి సర్వీస్‌రోడ్డుపై పడింది. ఈ ఘటనలో డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. లారీలోని పండ్లన్నీ రోడ్డుపై పడిపోయాయి.

పేకాడుతున్న ముగ్గురి అరెస్టు

బాన్సువాడ రూరల్: మండలంలోని జక్కల్‌దాని తండా శివారులో గల అటవీప్రాంతంలో పేకాడుతున్న ముగ్గురిని పట్టుకున్నట్లు బాన్సువాడ సీఐ మండల అశోక్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేసి వారిని పట్టుకున్నామన్నారు. అలాటే వారి వద్ద నుంచి రూ.24, 470 నగదు 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈనెల 9న కూడా ఇదే జక్కల్‌దాని తండాలోని స్మశానవాటిక వద్ద పేకాడుతున్న నలుగురిని పట్టుకొని రూ.10,270 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

మట్కా ఆడుతున్న ముగ్గురు..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో మట్కా ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ ఆదివారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు మట్కా స్థావరంపై దాడిచేసి గుజరాతి గోవర్ధన్, వాడుల మోహన్, మహ్మద్ రహీముద్దీన్‌ను అరెస్టు చేశామన్నారు. వారి నుంచి రూ. 15వేల నగదు, రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పరారయిన మట్కా నిర్వాహకుడి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చిరుత దాడిలో లేగదూడలు మృతి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని నల్లమడుగు అటవీ ప్రాంతంలో చిరుత దాడిచేసి రెండు లేగ దూడలను హతమార్చినట్లు బాధితుడు దూప్‌సింగ్ తెలిపారు. నాలుగు రోజుల క్రితం ఆవుల మందను మేతకు అడవికి తీసుకెళ్లగా సాయంత్రం రెండు లేగదూడలు కనిపించలేదని తెలిపారు. లేగదూడల కోసం మూడు రోజులుగా అటవీ ప్రాంతంలో గాలించగా ఆదివారం కుళ్లిపోయిన లేగదూడల కళేబరాలు కనిపించినట్లు బాధితుడు తెలిపాడు. చిరుత దాడిలోనే లేగదూడలు మృతి చెందాయని, అటవీశాఖ అధికారులు నష్టపరిహారం అందజేయాలని కోరారు.

షార్ట్‌సర్క్యూట్‌తో రెండు ఇళ్లు దగ్ధం



ధర్పల్లి: మండల కేంద్రంలోని గోసంగి కాలనీలో షార్ట్ సర్క్యూట్‌తో రెండు ఇళ్లు దగ్ధమైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాలు ఇలా.. గోసంగి కాలనీలో సల్ల భాగ్య, తురపాటి సాయమ్మ కుటుంబ సభ్యులతో కలిసి పాత సామాన్ల కొనుగోలు వ్యాపారం చేసుకుంటూ నివాసం ఉంటున్నారు. ఈక్రమంలో వారు ఎప్పటిలాగానే ఆదివారం ఉదయం బయటకు వెళ్లారు. మధ్యాహ్నం సల్ల భాగ్య ఇంట్లో విద్యుత్ తీగలు కాలిపోయి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అనంతరం పక్కన ఉన్న తూరపాటి సాయమ్మ ఇంట్లోకి మంటలు వ్యాపించాయి. స్థానికులు గమనించి మంటలను ఆర్పి వేశారు. కానీ అప్పటికే రెండు ఇళ్లలోని సామాన్లు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. సల్ల భాగ్య ఇంట్లో తులం బంగారం, వెండి ఆభరణాలు, రూ.3లక్షల నగదు కాలిపోగా, తూరపాటి సాయమ్మ ఇంట్లో కొంత నగదుతోపాటు వంట సామగ్రి, దుస్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయాయి. సుమారు రెండు ఇళ్లల్లో కలిపి సుమారు రూ. 5లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని వారు వేడుకున్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆర్మూర్ బాలరాజ్ బాధిత కుటుంబాలను పరామర్శించి వంట సామగ్రి, దుస్తులను అందజేశారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



రవీందర్‌రెడ్డి (ఫైల్)

ఇందల్వాయి/ఖలీల్‌వాడి: ఇందల్వాయి–సిర్నాపల్లి రైల్వే లైనును ఓ వ్యక్తి దాటుతుండగా రైలు ఢీకొని మృతిచెందాడు. రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపిన వివరాలు ఇలా.. ఇందల్వాయి మండలం గన్నారం గ్రామానికి చెందిన బద్దం రవీందర్ రెడ్డి (46) ఆదివారం ఉదయం తన పొలం వద్దకు బయలుదేరాడు. ఈక్రమంలో ఇందల్వాయి–సిర్నాపల్లి రైల్వే స్టేషన్ల మధ్య రైలు పట్టాలను అతడు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొని మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనారోగ్యంతో శతాధిక వృద్ధురాలు..




నర్సవ్వ (ఫైల్)

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని పద్మాజివాడి గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు సామల నర్సవ్వ(103) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నర్సవ్వ వృద్ధాప్యం వచ్చినప్పటికీ కూడా తన పనులు తాను చేసుకునేదని పేర్కొన్నారు. నర్సవ్వ మృతితో కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు.

చికిత్స పొందుతూ వివాహిత..

లింగంపేట(ఎల్లారెడ్డి): ఆత్మహత్యకు యత్నించిన ఓ వివాహిత ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఎస్సై దీపక్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని అయ్యపల్లితండాకు చెందిన దేవసోత్ సుజిత(20) అత్తింటివారి వేధింపులు భరించలేక ఆగస్టు 10 గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు..



ఖలీల్‌వాడి: నిజామాబాద్ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఐదో టౌన్ ఎస్సై గంగాధర్ తెలిపారు. నగరంలోని న్యాలకల్ రోడ్‌లోగల కల్లు బట్టి సమీపంలో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి స్పృహ లేని స్థితిలో గుర్తించారు. వెంటనే సదరు వ్యక్తిని చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతిచెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడు లేత ఆరెంజ్ రంగు, కలర్ ఫుల్ షర్ట్, ముదురు నీలి రంగు ప్యాంటు ధరించినట్లు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 65 ఏళ్ల వరకు ఉంటాయని, న్యాల్కల్ రోడ్‌లో భిక్షాటన చేసేవాడని అన్నారు. అతని దగ్గర ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే ఐదో టౌన్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలన్నారు.



నవీపేట: నిజామాబాద్ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. నవీపేట ఎస్సై తిరుపతి తెలిపిన వివరాలు ఇలా.. నవీపేట శివారులోని అయ్యప్ప ఆలయ సమీపంలో ఈనెల 12న గుర్తుతెలియని ఓ వ్యక్తి అస్వస్థతకు గురైయ్యాడు. వెంటనే స్థానికులు గమనించి అతడిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి వయస్సు సుమారు 36ఏళ్లు ఉంటాయని ఎస్సై అన్నారు.

పలువురిపై కేసు నమోదు

మోపాల్: మండలంలోని ఒడ్డెర కాలనీకి చెందిన దండుగుల ఎల్లయ్యపై అకారణంగా దాడిచేసిన పలువురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై సుష్మిత ఆదివారం తెలిపారు. వివరాలు ఇలా.. ఎల్లయ్య టిప్పర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇదేక్రమంలో ఆదివారం సాయంత్రం గేదెలు అడ్డుగా ఉన్నాయని టిప్పర్‌ను రోడ్డు పక్కన నిలిపాడు. వెనకాల బైక్‌లపై వస్తున్న నిజామాబాద్‌కు చెందిన యువకులు టిప్పర్‌ను ఎందుకు నిలిపావంటూ ఎల్లయ్యపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, దాడికి పాల్పడ్డారు. ఆరు ద్విచక్ర వాహనాలపై పది మంది యువకులు వచ్చి దాడిచేశారని ఎల్లయ్య ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పోచారం ప్రాజెక్టు నీటిలో మునిగి యువకుడు మృతి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పోచారం ప్రాజెక్టు నీటిలో మునిగి ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు ఇలా.. మెదక్ పట్టణానికి చెందిన షేక్ మహబూబ్(20)అనే యువకుడు ఆదివారం తన స్నేహితులతో కలిసి మండలంలోని పోచారం ప్రాజెక్టుకు వచ్చాడు. ప్రాజెక్టు అలుగు పైనుంచి వెళ్తుండగా, కాలు జారి నీటి ప్రవాహంలో పడిపోయాడు. నీట మునిగి ఊపిరాడక మృతిచెందినట్లు తెలిసింది. మృతుడి అన్న షేక్ వాజీద్ హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు నాగిరెడ్డిపేట పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు.

కరెంట్‌షాక్‌తో నెమలి..



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని కృష్ణాజివాడి గ్రామ శివారులో కరంట్ వైర్లకు నెమలి తగిలి షాక్‌తో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో శనివారం రాత్రి అకస్మాత్తుగా కరంటు సరఫరా నిలిచిపోవడంతో ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది వచ్చి స్తంభాలను, వైర్లను పరిశీలించారు. సమస్యను గుర్తించకపోవడంతో వేరే లైన్‌కు కనెక్షన్ ఇచ్చారు. తిరిగి ఆదివారం అధికారులు గ్రామశివారులో గల విద్యుత్ స్తంభాలు, వైర్లను పరిశీలించారు. శివారులోని వైర్లపై నెమలి పడి చనిపోయినట్లు కనిపించిందన్నారు. దీంతో వైర్లపై మృతి చెంది ఉన్న నెమిలిని కిందికి తీసి యథావిధిగా కరంటు కనెక్షన్ ఇచ్చారు.